# తాతయ్య గది

సూరెపల్లి విజయ
1-9-11/9బి/1, అజంపురా
మెదక్-502 110.

"తాతయ్యా, చాక్లెట్ తిను"

"వద్దు బాబూ, నువ్వుతిను?"

తిను తాతయ్యా, నీకు ఎవ్వరూ ఇవ్వరుగా"

"మా నాయనే నామీద ఎంత ప్రేమరా నీకు"

"బబ్లూ ఎక్కడున్నావురా? హోంవర్క్ చేస్కుందువు"

"వెళ్ళు బాబూ, అమ్మ పిలుస్తోంది."

"వస్తున్నా నమ్మా"

"అక్కడ ఏం పని నీకు- అస్తమానం వెళ్తావు"

"తాతయ్యకు చాక్లెట్ ఇద్దామనీ"

"ముసలాయనకు చాక్లెట్లు కూడానా, ఎవరైనా పిల్లల దగ్గర అడిగి తీసుకుంటారా?"

"తాతయ్య అడగలేదమ్మా, నేనే ఇస్తుంటే వద్దన్నాడు. ఎందుకమ్మా ఎప్పుడూ తాతయ్యను తిడతావు"

"పెద్దవాళ్ళ విషయాలు నీకెందుకు? పద లోపలికి"

★ ★ ★

వర్షం అసలు తగ్గడం లేదు. తాతయ్య ఒక్కడూ ఏం చేస్తున్నాడో పాపం! తాతయ్య దగ్గు మాత్రం వినపడుతోంది. అమ్మ వంటింట్లో ఉంది. మెల్లగా మెట్లుదిగి పెరట్లో ఉన్న తాతయ్య గదిలో కెళ్ళి "తాతయ్యా, చలిగా ఉందా? నీ దగ్గర మంచి దుప్పటి లేదు. ఈ దుప్పటి కప్పుకో"

"వద్దు బాబూ తీసుకెళ్ళు! మీ అమ్మ చూస్తే తిడుతుంది."

"ఫర్వాలేదు తాతయ్యా! నీ గదంతా కురుస్తోంది. ఎట్లా పడుకుంటావు?"

"అలవాటైంది బాబూ, నువ్వెళ్ళు, అదుగో అమ్మ వస్తోంది."

"మెల్లగా వెళ్తాను తాతయ్యా, నువు పడుకో"

అమ్మ చూడకుండా ఇంట్లోకొచ్చి మంచం మీద పడుకున్నాను. వర్షం ఇంకా పెద్దగా పడుతోంది. దానికి తోడు తాతయ్య దగ్గుకూడా పెద్దగా వినిపిస్తోంది. ఇంతలో అమ్మ నా దగ్గరకు వచ్చి పడుకుంది. అటు తిరిగి పడుకున్నా ఎందుకో నిద్రరావడం లేదు. తాతయ్యే గుర్తుకు వస్తున్నాడు. అలాగే కళ్ళు మూసుకుని పడుకున్నాను.

★ ★ ★

అమ్మ ఇంకా లేవలేదు ఈ రోజు. ఎండ కూడ వచ్చేసింది. ఉన్నట్టుండి పెద్దగా ఏడుపులు పెరట్లోంచి విన్పించాయి. అక్కడికి వెళ్ళి చూస్తే తాతయ్య కింద చాపమీద పడుకుని నిద్రపోతున్నాడు. చుట్టూ అందరూ కూర్చుని ఏడుస్తున్నారు.



దగ్గరకు వెళ్లాను.

"బాబూ, తాతయ్య ఇకలేడు వెళ్ళిపోయారు" అంటూ అమ్మ నన్ను పట్టుకుని పెద్దగా ఏడుస్తోంది.

నాన్న కూడా అక్కడే కూర్చున్నారు. తాతయ్య దగ్గరకు ఎప్పుడూ వెళ్ళని అమ్మా, నాన్నా ఇంకా చాలా మంది అక్కడే ఉన్నారు.

"తాతయ్య కేమయింది, నిద్రపోతుంటే ఎందు కేడుస్తున్నారు.

తాతయ్య గదిలోకి వెళ్తే మంచం ఖాళీగా ఉంది. మంచం దగ్గరే నిన్న నేనిచ్చిన చాక్లెట్ రేపర్ కింద పడి ఉంది. తాతయ్య చాక్లెట్ తిని నిద్రపోయాడు. బయట పెద్దగా చప్పుడు వినపడుతోంది. తాతయ్యను బయటకు తీసుకెళ్తున్నారు. అందరూ పెద్దగా ఏడుస్తున్నారు.

తాతయ్య దగ్గరకు నిన్నటి వరకూ ఎవరూ రాలేదు. ఇప్పుడు అందరూ వచ్చి తాతయ్యను ఎక్కడికి పంపిస్తున్నారు?

బాబూ, రా! తాతయ్యను చూద్దువు దేవుడి దగ్గరకు వెళ్తున్నారు ఇకరారు" అమ్మ పిలుస్తోంది.

తాతయ్య ఇక రాడు దేవుని దగ్గరకు వెళ్తున్నాడట, ఇంట్లో వాళ్ళమీద కోపం వచ్చిందేమో? తాతయ్య దగ్గరకు ఎవరు రాలేదని తనే దేవుడి దగ్గరకు వెళ్తున్నాడేమో మరి! వీరందరూ ఎందుకు ఏడుస్తున్నారు?

★ ★ ★

తాతయ్య గదిలో మంచం తీసేశారు. పైన పెంకులు కూడా తీస్తున్నారు.

"ఎందుకమ్మా తాతయ్య గది తీసేస్తున్నారు?"

"తాతయ్య లేరుగా"

"నేను పెద్దయ్యాక - ఆ గదిలో నాన్న ఉంటారుగా, ఎందుకు తీస్తున్నారు"?

ఎవరూ ఏమీ మాట్లాడకుండా ఎందుకో నావంక విచిత్రంగా చూస్తున్నారు?

ఈ పెద్దవాళ్ళు ఎప్పుడు ఏం చేసేదీ వాళ్ళకే తెలీదు!★